
## చిట్టికథల పోటీలో
## రూ. 150 బహుమతి
## పొందిన కథ




రాజారావు ఆరోజే ఆ ఆఫీసులో రెండునెలల లీవ్ వేకెన్సీలో టెంపరరీ క్లర్క్‌గా చేరాడు. చేరిన రెండు రోజుల్లోనే ఆఫీసులో అందరికీ సన్నిహితుడయ్యాడు. చలాకీగా – కలుపుగోలుతనంతో వ్యవహరించే అతని తీరు అందరినీ ఆకట్టుకుంది. "పాపం... మంచివాడు... రెండునెలల తర్వాత వెళ్లిపోతాడు" అని కొందరు అప్పుడే లోలోపల అతనిపట్ల సానుభూతికూడా చూపారు.

ఆఫీసులో తక్కిన యువతులు అందరికంటే యమున ధోరణి ప్రత్యేకంగా ఉండడం చేరిన రోజునే గమనించాడు రాజారావు. అతని సెక్షన్‌కు సంబంధించిన ఫైల్స్ విషయంలో యమున సలహాలే తీసుకోవాలి. అందువల్ల పక్కసీట్‌లో ఉన్న ఆమెను రాజారావు తరచుగా సంప్రతించ వలసి వచ్చేది.

ఒకవారం రోజుల తర్వాత – సాయంత్రం ఆఫీసు నుంచి ఇంటికి వెళ్లేటప్పుడు రాజారావు చొరవ తీసుకుని – యమునను రెస్టారెంట్‌కు ఆహ్వానించాడు. ఆమె ఒక్కసారి తీక్షణంగా అతని వంక చూసింది. రాజారావు కలవరపడిపోయాడు. రెండు నిమిషాల తర్వాత "సరే... పదండి" అన్నది చిరునవ్వుతో. వాళ్లిద్దరూ కలిసి వెళ్తూ వుండడాన్ని అదే ఆఫీసులో పనిచేస్తున్న ఇద్దరు ముగ్గురు యువతులు చూసి నవ్వుకుని, మెల్లగా ఏదో వ్యాఖ్యానించుకోవడం – యమున, రాజారావు గమనించకపోలేదు.

రూఫ్ గార్డెన్ రెస్టారెంట్‌లో – అట్టే జనంలేని చోట – ఓ మూల కూర్చున్న తర్వాత రెండు ఐస్‌క్రీములు ఆర్డర్ చేసి, యమున వంక చూసి చిరునవ్వు నవ్వాడు రాజారావు.

"ఒక్క క్షణం మీరు నా వంక తీక్షణంగా చూసి భలే కంగారు పెట్టేశారు... నాతో రెస్టారెంట్‌కు వస్తే – ఎవరైనా ఏమైనా అనుకుంటారని మొదట మీరు వెనకాడారు కదూ..." అన్నాడు రాజారావు. యమున రాజారావు వంక మళ్లీ తీక్షణంగా చూసింది.

"రాజారావుగారూ... ఎప్పుడూ ఒకరు ఏమైనా అనుకుంటారనే పద్ధతిలో ఆలోచించే తత్త్వంకాదు నాది. నా అంతరాత్మకు ఏది రైటనిపిస్తే ఆ పనే చేస్తాను. ఇతరులు మంచిగా అనుకోవాలని, అందుకు అనుకూలంగా నటించడం, కృత్రిమంగా ప్రవర్తించడం నా వల్లకాదు. మీతో రెస్టారెంట్‌కు రావడాన్ని నా సాటి ఉద్యోగినులే రకరకాలుగా వ్యాఖ్యానించవచ్చు. అంతెందుకు... పిలవగానే వచ్చినందుకు మీరే నన్ను మరోలా అంచనా వేయవచ్చు..."

రాజారావు ఉలిక్కిపడ్డాడు.

"కంగారు పడకండి... మీరు సదుద్దేశంతోనే

పిలిచివుంటారని నా నమ్మకం" అంది యమున నవ్వుతూ.

"చూడండి... మీరిలా కపటం లేకుండా ఉన్నది ఉన్నట్లు నిర్భయంగా మాట్లాడడం... మీ వ్యక్తిత్వం... మీ పట్ల గౌరవభావాన్ని పెంచాయి. 'స్త్రీ స్వేచ్ఛ' అంటే అధునిక దుస్తులు ధరించి, మగవాళ్లను రెచ్చగొడుతూ మరోపక్క వాళ్లను లెక్కచేయనట్లు ప్రవర్తించడం, విచ్చలవిడిగా తిరగడం వంటి లక్షణాలని భావించే స్త్రీలు ఎక్కువైపోతున్న ఈ రోజుల్లో... మీలా స్నేహ పూర్వకంగా మాట్లాడే వ్యక్తిని చూడడం నాకు చాలా అనందంగా వుంది" అన్నాడు రాజారావు ఆమెవంక అరాధనాపూర్వకంగా చూస్తూ.

"సార్... మీరు నా గురించి బాగా తెలిసినట్లే పొగిడేస్తున్నారు." అంది యమున.

"యమునగారూ... మీరు నమ్మినా, నమ్మకపోయినా సరే... మీతో నా మనసులోని మాట చెబుతున్నాను. ఇంతవరకూ నా ఉద్యోగ విజయాల్లో కనీసం యాభైమంది వనితలైనా తటస్థపడి వుంటారు. అందరిలోనూ ఏదో ఒక రకమైన కృత్రిమధోరణి, అనవసరపు బెరుకు తనం, అనుమానపూర్వకమైన దృష్టి, చాలా విషయాల్లో మానసిన అపరిపక్వత, నేలబారు అభిరుచులు... వాళ్లను చూసినప్పుడు నాకు చాలా జాలి కలిగేది..."

"అంటే మీ మగవారిలో అలాంటివారు ఉండరనా మీ ఉద్దేశం?"

"సరే... తెలివితేటల విషయంలో వ్యక్తుల ఐ.క్యు. రేట్‌ను బట్టి తేడాలు వుండవచ్చు, ఒప్పుకుంటాను. కాని ఇప్పుడున్న సామాజిక వాతావరణంలో స్త్రీలు అంత బేలతనంతో వుండవలసిన అవసరం లేదంటాను. అందుకే మీలాంటి యువతులను చూసినప్పుడు - స్త్రీ పురోగమనం మీద నాకు నమ్మకం కలుగుతూ వుంటుంది." అన్నాడు రాజారావు ఆవేశంగా.

"రాజారావుగారూ ... మీరు స్త్రీ పురోగమనం గురించి అంతగా ఆలోచిస్తున్నారు కదా... మరోలా అనుకోకపోతే ఒక మాట అడుగుతాను. మా ఇంటికి దగ్గరలోనే ఒక అనాథశరణాలయం వుంది. అక్కడ పెరిగి, చక్కగా చదువుకుని ఉద్యోగాలు చేస్తున్న అమ్మాయిలు కొందరున్నారు. మీరు వాళ్లల్లో మీకు నచ్చిన ఒక అమ్మాయిని పెళ్లిచేసుకుని, ఆమెకు కొత్త జీవితాన్ని ప్రసాదించ గలరా?" సూటిగా అడిగింది యమున.

ఎదురుచూడని ఆ ప్రశ్నకు ఏం చెప్పాలో తెలియక సతమతమైపోయాడు రాజారావు. ఆ తర్వాత తేరుకుని... "మీరు... నేను... ప్రపంచం గురించి మాట్లాడుతూ వుంటే, మీరు వ్యక్తిగతమైన విషయం అడుగుతున్నారు..." అన్నాడు తడబడుతూ.

"సారీ... మిమ్మల్ని నొప్పించడం నా ఉద్దేశం కాదు. అభ్యుదయానికి సంబంధించిన విష యాలు చెప్పడం తేలికే... కానీ ఎవరి స్వార్థాలు వాళ్లకు ఉంటాయి. అలాగే... ఇవాళ్టి సగటు స్త్రీ మీరు చెప్పినట్లు మానసికంగా అపరిపక్వదశలో వుందంటే, అందుకు బాధ్యత వహించవలసింది ఈనాటి సమాజమే" అని 'టాపిక్'ను మరోవైపుగా మళ్లించింది యమున.

"చూడండి... మీకీ విషయం తెలుసునా? ఒకప్పుడు మెడగాస్కర్‌లో వధువు తరపు స్త్రీలు నలుగురైదుగురు - వరుణ్ణి ఎన్నుకోడానికి ఒక పద్ధతిని అవలంబించేవారట. ముందుగా అతన్ని ఒక చోట నిలబెట్టి - ఒక్కొక్కరూ ఒకో ఈటెను అతని మీదకు విసిరేవారు. అతను ప్రతి ఈటెను ఒడుపుగా చంకన బెట్టుకుని - రెండో ఈటెను పట్టుకోవాలి. అలా అన్ని ఈటెలనూ పట్టుకో గలిగితేనే, అతనికి ఆ అమ్మాయినిచ్చి పెళ్లి చేసేవారు. ఒక వేళ అతను ఈటెను పట్టుకోలేక, అది గుచ్చుకుని అతను గాని చనిపోతే, "హమ్మయ్య... ఇలాంటి వాడు వరుడుగా రావడం కంటే చావడమే మేలు" అనుకునేవారట. ఇప్పుడు పెళ్లిళ్ల విషయంలో అలాంటి పద్ధతి ఇక్కడ లేనందుకు మీ మగవాళ్లు సంతోషించాలి," అంది యమున నవ్వుతూ.

రాజారావు ఆమె చెప్పిన సంగతి విని నవ్వు ఆపుకోలేకపోయాడు. ఆ విధంగా - ఆరోజు గంభీరంగా వాళ్ల మధ్య సాగిన చర్చకు ఫుల్‌స్టాప్ పడింది!

* * *


మేనేజర్ రంగనాథంగారు సంతకాలు చేసిన ఉత్తరాల ఫైల్‌ను యమునకు యిస్తూ "కూర్చో యమునా?" అన్నారు. ఆయన టేబుల్‌కు ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంది.

"రాజారావుకు రేపు మన ఆఫీసులో చివరి రోజు... అతనిది లీవ్ వేకెన్సీ కదా..." అన్నారు రంగనాథం. యమున మాట్లాడలేదు.

"అతని గురించి నీ అభిప్రాయం ఏమి టమ్మా... మంచివాడే కదూ..." అవుననట్లు తలూపింది యమున.

"సరే... ఇక ఈ సస్పెన్స్‌ను నీ ముందు దాచుకోలేనుగానీ నిజం చెప్పేస్తున్నాను. రాజా రావు నిజంగా నిరుద్యోగి కాదమ్మా... అతని అసలు పేరు శ్రీనాథ్. మద్రాసులో వున్న మన కంపెనీ ఎమ్.డి. గోపీనాథ్‌గారి కొడుకు. గోపీనాథ్‌గారికి ఓ మధ్యతరగతి కుటుంబానికి చెందిన అమ్మాయి తన ఇంటికి కోడలుగా రావాలని కోరిక. పోయిన నెల ఇన్‌స్పెక్షన్‌కు మన వూరికి వచ్చినప్పుడు నిన్ను చూశారట. వాళ్ల అబ్బాయి శ్రీనాథ్‌కు నీ గురించి చెప్పారట. నీ గుణగణాలను స్వయంగా చూసి నిర్ణయం తీసుకుంటానని చెప్పి, ఇలా ఉద్యోగంలో చేరాడన్నమాట... నువ్వు అతనికి బాగానచ్చావు. బహుశా వచ్చేవారంలో గోపీనాథ్ గారి కుటుంబ సభ్యులు మీ ఇంటికి వచ్చి మీ వాళ్లతో సంబంధం గురించి మాట్లాడతారు... యుఆర్ రియల్లీ ఎ లక్కీ గర్ల్" అన్నారు రంగనాథంగారు.

ఆయన మాటలు విని నిర్ఘాంతపోయింది యమున. తన సీట్లోకి వచ్చి కూర్చుని దీర్ఘాలోచనాలో పడింది.



మీరు కొనే పట్టుచీరల్లోని జరీ అసలు జరీనా లేక నకిలీదా అని తెలుసుకోవాలనుకుంటున్నారా? అయితే పట్టుచీర జరీలో నుండి ఓ చిన్న జరీముక్క తీసుకుని దాన్ని మధ్యకు తెంపినప్పుడు జరీలోని మధ్యదారం ఎర్రపోగు అయితే అది అసలు జరీ లేక తెల్ల పోగు వచ్చిస్తే అది నకిలీ జరీ.



గ్రుడ్డు వాడిన గిన్నెల్లో ఆ వాసన పోవడం లేదా? అయితే వాడిన కాఫీ పొడితోగాని వాడిన టీ పొడితో కాని తోమండి. వాసన మటుమాయం.

– బి. సంఘమిత్ర, వరంగల్.

* * *

మర్నాడు హుషారుగా ఆఫీసుకు వచ్చిన రాజారావు ఉరఫ్ శ్రీనాథ్‌కు అతని టేబిల్ మీదున్న కవరు స్వాగతం పలికింది. యమున సీటు ఖాళీగా వుంది. ఆత్రుతగా కవరు చించి, ఉత్తరం చదవడం ఆరంభించాడు.

"శ్రీనాథ్‌గారూ... స్త్రీ పురోభివృద్ధి అంటూ లెక్చర్లిచ్చే మీలోనూ స్వార్థం, పురషాహంకారం బయటపడ్డాయి. మీరు పెళ్లి చేసుకోవాలనుకునే అమ్మాయి గుణగణాలు తెలుసుకోడానికి మీరు పరీక్షలు పెట్టవచ్చును. రెండు నెలలపాటు అన్ని విషయాలూ 'పరిశీలించాక' నిర్ణయం తీసుకో వచ్చును. కానీ మిమ్మల్ని పెళ్లాడే అమ్మాయికి మాత్రం మీ నేపథ్యం గురించి తెలుసుకోవలసిన అవసరం లేదు. మీరు చాలా ఉత్తములై వుంటారని నమ్మి - మీకు తలవంచాలి. కారణం మీరు పురుషులు... 'ఎమ్.సి.పి' అని మీలాంటి వాళ్లను అనడంలో ఏ మాత్రం తప్పులేదు. కాబోయే భార్య మీద మీకు ముందే ఇంత సందేహం వున్నప్పుడు, పెళ్లయిన తర్వాత ఇంకెంతగా 'నిఘా' వేస్తారో... తలచుకుంటేనే కంపరంగా వుంది. మీకు, మీ ఐశ్వర్యంతో పెరిగిన పురుషాహంకారానికి ఓ నమస్కారం. మరోవారం రోజుల తర్వాతనే నేను ఆఫీసుకు వస్తాను. అప్పటికి మీరు నన్ను పూర్తిగా మర్చిపోయి, మీ వూళ్లో మరో యువతిని ఎవరినైనా 'పరిశీలించే' ప్రయత్నంలో వుంటారని అనుకుంటున్నాను. గుడ్‌బై... - యమున."

ఉత్తరం చదువుకుని, భారంగా కుర్చీలో కూలబడిపోయాడు శ్రీనాథ్. ☆